# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

2. **శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకూ ప్రతి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.**

4. **అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లుఅని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పేదరిక నిర్మూలన, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.**

5. **కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పిసి ఘోష్ కమిషన్ నివేదికపై ఈ రోజు శాసన సభలో చర్చ జరుగుతుందని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

--------------------------

శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకూ ప్రతి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి ఎకరాకు సాగు నీరిచ్చి సస్యశ్యామలం చేస్తామని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఐదు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో కుప్పంలో కృష్ణా జలాలను పారించిన రోజు మరచిపోలేనిదన్నారు. 1999లో హంద్రీ-నీవా ప్రాజెక్టుకు తానే శంఖుస్థాపన చేశానని, ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని పట్టుదలతో దీనిని పూర్తి చేసేందుకు సంకల్పం తీసుకున్నానని తెలిపారు. దీని ఫలితమే గత నెలలో మల్యాల నుంచి నీటిని విడుదల చేసి రాయలసీమకు నీరిచ్చినట్లు, నిన్న చిత్తూరు జిల్లా చిట్ట చివరి భూములకు జలకళ తెచ్చినట్లు పేర్కొన్నారు.

--------------------------

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయిచింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాదులోని శాసన సభ కమిటీ హాలులో నిన్న మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశం వివరాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాత్రికేయులకు వివరించారు. జీవో ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, రిజర్వేషన్లపై సీలింగ్ 50 శాతాన్ని తొలగిస్తూ గతంలో రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా స్థానంలో ఈ రోజు అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టాలని నిర్ణయించిందన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్ పేర్లు ఖరారు చేసినట్లు తెలిపారు. 2023లో రైస్ మిల్లర్లు ఇచ్చిన ధాన్యాన్ని... వెనక్కి ఇవ్వని వారి నుంచి రికవరీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని చెప్పారు. వాతావరణాన్ని కచ్చితంగా అంచనా వేసేందుకు అధునాతన పరికరాలు కొనుగోలు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు.

---------------------------

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లుఅని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పేదరిక నిర్మూలన, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా బొండపల్లి, అంబటివలస గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలను అదించాలని సూచించారు. అర్హులైన వారందరికీ పెన్షన్ ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఒకవైపు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూనే, సంక్షేమానికి కూడా అత్యధిక ప్రాధాన్యత నిస్తోందని, ముఖ్యంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు పెద్దపీట వేస్తుందని పేర్కొంటూ..

(వాయిస్... 30 సెకన్లు)

---------------------------

కుప్పం అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో వివిధ సంస్థలతో సంబంధిత శాఖలు నిన్న ఆరు ఒప్పందాలు చేసుకున్నాయి. వ్యర్థాల నుంచి సంపద సృష్టించేందుకు... ఎజిఎస్– ఐటిసి సంస్థతో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా వ్యర్థాల సుస్థిర నిర్వహణపై ఇంటింటి ప్రచారం, పాఠశాలల్లో 15 ఏళ్ల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళా సంఘాల ఉత్పత్తుల తయారీ, గ్రామీణ ప్రాంతాల్లో మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు... పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ, షీలీడ్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా కుప్పం నియోజకవర్గంలో 10 వేల మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయటంతో పాటు..వారికి శిక్షణ ఇవ్వనున్నారు. కుప్పంలో మామిడి, జామ, టమోటో గుజ్జ యూనిట్ల ఏర్పాటుకు వివిధ సంస్థలతో ఒప్పందం కుందిరిందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా, కొత్త గుంటూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు 5 కోట్ల రూపాయలు కేటాయించినట్లు కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో రైల్వే, గృహనిర్మాణ ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరేట్‌లో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. గుంటూరు పరిధిలో గృహనిర్మాణ పథకంలో భాగంగా

నిర్మించిన 13 వేల గృహాల్లో కేవలం 300 మాత్రమే వినియోగంలో ఉన్నాయని, మిగిలిన వాటిని వినియోగించేందుకు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొంటూ..

(వాయిస్... 30 సెకన్లు)

---------------------------

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పిసి ఘోష్ కమిషన్ నివేదికపై ఈ రోజు శాసన సభలో చర్చ జరుగుతుందని తెలంగాణ ఐటి, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. నిన్న నిర్వహించిన శాసనసభ వ్యవహారాల కమిటీ – బీఏసీ సమావేశం ముగిసిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఈ రోజే సభలో పెట్టనున్నట్లు తెలిపారు. కాళేశ్వరంపై సభలో భారత రాష్ట్ర సమితి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే విషయంపై సభాపతి నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

---------------------------

హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు జయంతి ఈరోజు. సంగీతం, సాహిత్యం నృత్యాల మేళవింపుతో హరికథా ప్రక్రియకి విశేష ప్రచారం కల్పించిన ఆయన.. 1864 ఆగస్టు 31వ తేదీన విజయనగరం జిల్లా బలిజిపేట మండలం అజ్జాడ గ్రామంలో జన్మించారు. రచయిత, కవి, బహుభాషాకోవిదుడు అయిన నారాయణదాసు తెలుగులో 17, సంస్కృతంలో 3, అచ్చతెలుగులో ఒక హరికథను స్వయంగా రచించారు. హిందుస్థానీభైరవి రాగాలాపనకు గానూ రవీంద్రనాథ్ ఠాగూర్‌తో ప్రశంసించబడ్డ ఆదిభట్ల నారాయణదాసు 1945 జనవరి 2వ తేదీన తుదిశ్వాసవిడిచారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలోని దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

(వాయిస్..18 సెకన్లు)

మరోవైపు తెలంగాణలో 5 రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతుందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. నిన్న రాత్రి 9 గంటలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 47.7 అడుగులు నమోదైందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధవళేశ్వరం వద్ద నిన్న రాత్రి 9 గంటలకు ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 10 లక్షల ఒక వెయ్యి క్యూసెక్కులు ఉందని, మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని తెలిపారు.

మరోవైపు కృష్ణా నదికి ప్రకాశం బ్యారేజి వద్ద 2 లక్షల 99 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైనట్లు వెల్లడించారు. ఆయా నదీపరీవాహక ప్రాంత, లోతట్టు గ్రామ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వినాయక నిమజ్జనాల్లోను జాగ్రత్తలు పాటించాలన్నారు.

====================